## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

విశాఖ విద్య: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉదయం 10గంటలకు 52వ వార్డు మద్రిపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కటింగ్ ఉంటుందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. 10.30గంటలకు ఎన్‌ఏడీ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేయనున్నట్టు చెప్పారు. పార్టీ నాయకులు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

### కరాటేతో ఆత్మరక్షణ



పోటీలు ప్రారంభిస్తున్న పుర్రె సురేష్

మల్కాపురం: ఆత్మరక్షణకు కరాటే ఎంతో మేలు అని ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ అన్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో విశాఖ జిల్లా కరాటే చాంపియన్ షిప్ 2024 కరాటే పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బాలికలకు విద్యతో పాటు ఆత్మరక్షణకు కరాటే కూడా చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ పోలారావు, స్థానిక నాయకుడు కుంచారావు, తదితరులు పాల్గొన్నారు.

### దుర్గాలమ్మ ఉత్సవాలు ప్రారంభం



మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జాలర వీధిలో స్థానిక శ్రీదైవ సేవా జాలర్ల కుల సంఘం ఆధ్వర్యంలో దుర్గాలమ్మతల్లి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా తొలి రోజైన ఆదివారం అమ్మవారికి జాలర సంఘం ప్రతినిధులతో పాటు కుల సభ్యులు పసుపు,కుంకుమలతో పూజలుచేశారు. 30 ఏళ్ల కిందట పండగ చేశారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఉత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో నగర నలుమూలల నుంచి సుమారు 14 మత్స్యకార గ్రామాల వారు అమ్మవారిని దర్శించుకుంటారు. దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేశారు.

### సింథటిక్ వాలీబాల్ కోర్టు ప్రారంభం



సింథటిక్ వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న రియర్ అడ్మిరల్ మురళీమోహన్‌రాజు

సింధియా: నౌకాదళ సిబ్బందిలో క్రీడా స్ఫూర్తి నింపేలా వైజాగ్‌లోని బేస్ విక్చువలింగ్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన సింథటిక్ వాలీబాల్ కోర్టును ఆదివారం రియర్ అడ్మిరల్ మురళీ మోహన్‌రాజు ప్రారంభించారు. అనంతరం వాలీబాల్ మ్యాచ్‌ను తిలకించి క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు.

### ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు నిర్వహించారు.



# వ్యాపారుల అతి తెలివి!

- జీవీఎంసీ షాపుల పక్కన అనధికారికరంగా షెడ్ల ఏర్పాటు
- అందులో యథేచ్ఛగా వ్యాపారాల నిర్వహణ
- ఖాళీగా జీవీఎంసీ షాపులు.. ప్రభుత్వ ఆదాయానికి గండి



షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో దర్జాగా షెడ్లు వేసుకుని సాగిస్తున్న వ్యాపారాలు



మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో అనధికారికంగా వ్యాపారాలు సాగిస్తున్న దృశ్యం

మల్కాపురం: వ్యాపారుల అతి తెలివి కారణంగా జీవీఎంసీ ఆదాయానికి గండిపడుతోంది. అద్దెకు షాపులు ఉన్నా తీసుకోకుండా అనధికారికరంగా షెడ్లు నిర్మించుకుని పలువురు యథేచ్ఛగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. 60వ వార్డు గుల్లలపాలెంలో జీవీఎంసీ అధికారులు మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ పేరిట సుమారు 30 షాపులను నిర్మించారు. వీటిలో కొన్నింటిని వేలంలో పలువురు వ్యాపారులకు కేటాయించారు. 12 షాపులు ఖాళీగా ఉన్నాయి. అయితే షాపింగ్ కాంప్లెక్స్ ముఖద్వారం రక్షణ గోడను ఆనుకుని చేపల మార్కెట్‌కు వెళ్లే మార్గంలో కొంత మంది కూరగాయల వ్యాపారులు అనధికారికంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ముఖద్వారం నుంచి చేపల మార్కెట్‌కు వెళ్లే దారి(సేవా మార్గం)ని పూర్తిగా ఆక్రమించి ముందుకు వచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కేటాయించిన షాపుల్లో వ్యాపారాలు చేయాలి. కానీ పలువురు వ్యాపారులు షాపులు అద్దెకు తీసుకోకుండా.. రక్షణ గోడకు ఆనుకుని షెడ్లను దర్జాగా ఏర్పాటు చేసుకున్నారు. సేవా మార్గంలో రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా అడ్డంగా కూరగాయలు పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాదు ఇక్కడ షాపు అద్దెకు తీసుకుంటే రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు జీవీఎంసీకి చెల్లించాల్సి ఉంటుంది. అదే రక్షణ గోడను ఆనుకుని వ్యాపారాలు సాగిస్తే ఎవరికి ఎటువంటి అద్దె చెల్లించనవసరం ఉండదని భావించి దర్జాగా కొన్నేళ్లుగా ఇలా పలువురు వ్యాపారులు తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న జీవీఎంసీ షాపులు

## కార్మిక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే గణబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు

సింధియా: కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే గణబాబును కలిసి వినతి పత్రం అందజేశారు.

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఓవర్ టైమ్ పని గంటలను ఐడీ యాక్ట్ నుంచి మినహాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. షీలానగర్ వద్ద గల టోల్‌గేట్‌ను శాశ్వతంగా తొలగించాలని, కార్మికులు నిత్యం ఇబ్బంది పడుతున్న గోడౌన్స్ సమీపంలోని రైల్వే క్రాసింగ్ వద్ద అండర్‌గ్రౌండ్ లేదా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని, అప్పటి వరకు పోర్టు అధికారులతో మాట్లాడి ట్రైన్ టైమింగ్ మార్చాలని కోరారు. మరి కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

కార్యక్రమంలో నేవీ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గుబ్బల అరుణ్‌కుమార్, అధ్యక్షుడు కొట్టే శ్రీను, అదనపు ప్రధానకార్యదర్శి భాను, ఉపాధ్యక్షుడు డి.మోహన్‌రావు, నాగార్జున, పీఎంఎల్ నాయుడు, వరప్రసాద్, పరమేష్, రమేష్, గణేష్, విజయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నూకాలమ్మ ఆలయం వద్ద కూలిన వేపచెట్టు



రజకుల కాలనీ నూకాలమ్మ ఆలయం వద్ద కూలిన చెట్టు



చెట్టు కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**తప్పిన ప్రమాదం**

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ సెంటర్ వద్ద రజకుల వీధిలో నూకాలమ్మ ఆలయం వద్ద ఉన్న వేపచెట్టు ఉన్నట్టుండి ఒక్కసారిగా కూలిపోయింది. ఇది చూసిన స్థానికులు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఉదయం 9గంటల సమయంలో నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలోని వేప చెట్టు చూస్తుండగానే మెల్లగా ఒరిగి పోయి పడిపోయింది. అయితే ఆ సమయంలో ఆలయం వద్ద ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ఈదురు గాలులు లేని కారణంగా మెల్లగా ఒరిగిందని లేని పక్షంలో పక్కనే ఉన్న ఇళ్లు దెబ్బతినేవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది వెంటనే స్పందించి చెట్టు కొమ్మలు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

**సందర్శించిన ఎమ్మెల్యే గణబాబు**

చెట్టు కూలిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జీవీఎంసీ సిబ్బంది చేత చెట్టును తొలగించే పనులను సమీక్షించారు. అపోహలు పడ వద్దని వేర్లలో బలం తగ్గితే ఈ విధంగా పడి పోతాయని చెప్పారు. ఆయనతో పాటు స్థానిక నాయకుడు బాల సుబ్రహ్మణ్యం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి, అవుట్‌సోర్సింగ్‌సూపర్ వైజర్ దమ్ము శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న మాలినాయుడు, ప్రకాష్, తదితరులు

సింధియా: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, దేశం సస్యశ్యామలంగా ఉండాలనే ఆలోచనతో ప్రధాని మోదీ పిలుపు మేరకు అమ్మపేరుతో ఒక మొక్కను నాటాలని బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్, 62వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 62వ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు యల్లబిల్లి వెంకట్రావు, జనసేన వార్డు అధ్యక్షుడు ఇంద్రజిత్, ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ మరణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

## విద్య ఆత్మ విశ్వాసాన్ని పెంచాలి



కార్యక్రమానికి హాజరైన అతిథులు

మల్కాపురం: విద్య ఆత్మవిశ్వాసాన్ని పెంచేదిగా ఉండాలని రామకృష్ణ మిషన్ స్వామిజీ స్వశంవేద్యానందాజీ అన్నారు. రామకృష్ణ మిషన్ వద్ద జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, ఎన్‌సీసీ ఆఫీసర్లకు యువజన అభివృద్ధిపై ఆదివారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. వ్యక్తిత్వ వికాసంపై, విద్యపై స్వామి వివేకానంద భావాలను తెలియజేశారు. ఈ సదస్సులో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, కో-ఆర్డినేటర్ డాక్టర్ హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రమౌళి

మల్కాపురం: వర్షకాలంలో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ,మలేరియా,చికున్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని జనసేన నాయకుడు చంద్ర మౌళి అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి వద్ద ఆదివారం సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. టైర్లు,పూలమొక్కలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ పలు అంశాలను వివరించారు. ఆరోగ్యం బాగోపోతే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

## వారాహికి కుంకుమ పూజలు



లలితా పీఠంలో వారాహి అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న అర్చకుడు

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చన చేశారు. వారాహి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అనాస పండ్లు నైవేద్యంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## బడి బాగుకు...

**ఏక తాటిపైకి పూర్వ విద్యార్థులు**



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో మాట్లాడుతున్న వైఎన్ ప్రసాద్

గోపాలపట్నం: తమ చదువుల కోవెల బాగు కోసం పూర్వ విద్యార్థులు ఏకమయ్యారు. అందుకు తగిన కార్యాచరణ రూపొందించారు. విద్యార్థులంతా కలిసి సంఘంగా ఏర్పడి పాఠశాలను అందరి సాయంతో అభివృద్ధి చేయాలని తీర్మానించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఇక్కడి బాలికల పాఠశాలలో సమావేశమయ్యారు. పాఠశాల ప్రారంభం 1963 నాటి నుంచి 2024 వరకు చదివిన పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు చాలా మంది హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధికి ఏవిధంగా తోడ్పాటునందిద్దామన్న పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు బ్యాక్ ఖాతా ప్రారంభించి నిధులు సేకరించనున్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా మజ్జారి శ్రీనివాసరావు, కార్యదర్శిగా వైఎన్ ప్రసాద్, కోశాధికారిగా సదరం శ్రీనాథ్, సంయుక్త కోశాధికారిగా కోనేటి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లుగా మహ్మద్ ఖలీల్ ఉర్ రహమాన్, కోల్కొండ శ్రీనివాసరావు, మేడిది రాజశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా కొయిలాడ వెంకటజగన్, శ్రీకుమార్, అల్లం రమేష్, న్యాయ సలహాదారుగా టి. సుగుణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వీరంతా పాఠశాల అభివృద్ధికి నిజాయితీగా కృషి చేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పీఎంపాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. నగరంలోని శ్యామల కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుత నృత్యాలతో అలరించారు. గణపతి స్తుతి గీతానికి చేసిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా కళాకారులు దీక్షిత ,స్నిగ్ధ ప్రమిదలో వెలిగించిన దీపాలు చేతబూని ఘటాలపై ప్రదర్శించిన నృత్యాభినయాలు కార్యక్రమంలో ప్రత్యేకంగా నిలిచాయి. కళకారులు మోక్షిత, సత్యవర్షిణి, రిషిత, జోషిత, శృతి, శ్రీజ, సహస్ర, అంజని, సమన్వి, కుందన ప్రియ, విద్య, ప్రణతి, లాస్య, శ్రావణి, దీక్షిత, చాందిని తదితరులు చేసిన నృత్యాలకు శ్యామల దర్శకత్వం వహించారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



గొల్లకంచరపాలెంలో..



గౌరీనగర్‌లో..





విరిగిన విద్యుత్ స్తంభం

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57వ వార్డు పరిధిలోని పలు సిమెంట్ విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. నేల కొరిగేందుకు సిద్ధంగా ఉండడంతో స్థానికులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు. కంచరపాలెం, ఊర్వశికూడలి పరిధిలోని గొల్లకంచరపాలెం ట్రాక్ రహదారి, తోటవీధి, గౌరీనగర్, సుభాష్‌నగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పగిలి ప్రమాదకంగా ఉన్నాయి. గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఓ పక్కకు ఒరింగింది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సమస్యపై విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఈపీడీసీఎల్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## వైభవంగా హరనాథుని జయంతి

దాబాగార్డెన్స్ : రాజీవ్‌నగర్ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీచే ఆదివారం హరనాథుని జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో గల కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు, కుసుమకుమారిదేవికి కుంకుమార్చనలు జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. షోడశాక్షరి నామంతో 24 గంటలు ఏకాహం చేపట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్ రమేష్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, కోశాధికారి ఎస్. అన్నాజీరావు, ఆశ్రమ ప్రతినిధులు శివ, సీతారాం, నాని, కృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ప్రోమోరన్





ప్రోమోరన్‌లో పాల్గొన్న నేవీ సిబ్బంది, రన్నర్లు





ఆర్కే బీచ్‌లో ప్రోమోరన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న జైషి హతంగడి

సింధియా: త్వరలో నిర్వహించనున్న వైజాగ్ నేవీ మారథాన్‌కు సన్నాహకంగా ఆదివారం తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ప్రోమోరన్‌ను ఐఎన్ఎస్ కళింగ, వైలెన్స్ ట్రీట్ రిస్క్ అసెస్‌మెంట్, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సెంటర్ల సహకారంతో ఆర్కే బీచ్‌లో నిర్వహించారు. 9వ ఎడిషన్ డిసెంబర్ 15న నిర్వహించనున్నారు. రన్నర్లు, ఇండియన్ నేవీ సిబ్బంది శారీరక సౌష్టవంతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్వహించిన ప్రోమోరన్‌ను హెరిటేజ్ వ్యాఖ్యాత జైషి హతంగడి జెండా ఊపి ప్రారంభించారు. రన్‌లో సుమారు 600 మంది నేవీ సిబ్బంది, రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు సుబ్రహ్మణ్యం, ప్రకాష్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్స్ కార్యక్రమం హాస్యం పండించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. వాటిలో తాత మనవడు మావ, గొట్టం గాడు, బ్యాంకు లోన్, అమలాపురం బస్సు, పిల్లిని చంపితే, సౌండ్ పార్టీ, జనాభా లెక్కలు, మిమ్మలనే ఫాలో అవుతున్నా, డాక్టర్ అలా చెప్పాడా స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భానుప్రకాష్, రామానుజం, సూర్యం, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, మల్లిక, నాగ గణేష్, సీతాగణేష్, భవాని, నాగరాజు అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకలను నవ్వుల్లో ముంచెత్తారు. కార్యక్రమంలో అతిథులు నందూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, బాదంగీర్ సాయి, డి.జె.నాగరాజు, బొబ్బాది అప్పారావు కళాకారులను సత్కరించి అభినందించారు.